**101**
**ధారావాహిక**



# జాయ సేనాపతి

## చారిత్రక కాల్పనిక నవల

మత్తి భానుమూర్తి ...
99893 71284

**జరిగిన కథ :** కూసెనపూండి కళాకేంద్రం. జాయపుని కళల కళాక్షేత్రం! అత్యున్నత ప్రమాణాలతో నాట్యప్రదర్శన కేంద్రం, దేశి విదేశీ నాట్య పరిశోధన కేంద్రం, గ్రంథాలయం, నాట్యారామం, భోజనశాల, దూరంనుంచి వచ్చేవారికి నివాస సముదాయం.. అన్ని సౌకర్యాలతో నిర్మాణం జరుగుతున్నది. ఓరోజు సిద్ధయ.. ఓ నాట్యాచార్యుడితో వచ్చి జాయపునికి పరిచయం చేశాడు. ఆ వచ్చినవాడు కంకుభట్టు. జాయపుణ్ని చూసి ఆశ్చర్యపోయాడు. ఇద్దరూ ఆప్యాయంగా మాట్లాడుకున్నారు. ఆ మాటల్లోనే.. మువ్వ ప్రస్థావన వచ్చింది. ఆమెను కంకుభట్టు నాట్యారామానికి పంపిస్తానని చెప్పాడు జాయపుడు.

**సోమాంబిక** నాట్యారామం వల్ల మువ్వ ఇప్పుడు పూర్తిస్థాయి కవయిత్రి, గాయని! లోకధర్మి నుంచి నాట్యధర్మి స్థాయికి ఎదిగిన నాట్యకారిణి.

'హమ్మయ్య!' అనుకుంటూ.. వెంటనే మువ్వను, పరాశరుణ్ని కంకుభట్టు నాట్యారామానికి పంపాడు జాయపుడు. వెళ్లేముందు..

''నిన్ను చూస్తుంటే గర్వంగా ఉంది మువ్వా..'' అంటూ, మరేదో అనబోయాడు.

మువ్వ అవేమీ పట్టించుకోకుండా ఆయన దగ్గరగా వెళ్లి చెవిలో చెప్పింది.

''స్వామీ.. గోపాలశతకం పూర్తయ్యింది. వినిపించ మంటారా..?!''.

జాయపుడు జవాబివ్వక ముందే పరాశరుడు కల్పించుకుని..

''వచ్చాక.. వచ్చాక! పద.. పద పద..'' అంటూ లాక్కుపోయాడు.

ఊపిరి పీల్చుకున్నాడు జాయపుడు.

కూసెనపూండి కళాక్షేత్రంలో కళాగోష్ఠిలో సూరప్పడు డప్పువాదనం ప్రత్యేక ఆకర్షణ. సాధారణంగా నిమ్నవృత్తుల వారి కళల ప్రదర్శన కవిపండితులు అంగీకరించరు. దాసరులకు, నిమ్నజాతుల కళాకారులకు కూడా ప్రవేశం ఉంటుందని పరాశరుడు తెగేసి చెప్పడంతో.. ఇప్పుడు సూరప్పడు వెలనాడు కవిపండిత గోష్ఠిలో ఒకడయ్యాడు. డప్పును సున్నితంగా ఎడమచంక వద్ద బంధించి సూరప వాయిస్తుంటే చూడాలి.. తనే ప్రేరణ నృత్తం చేసేలా ఊగిపోతాడు జాయపుడు. ప్రేరణ కోసం సూరపతో కొత్త శబ్దాలు అభ్యాసం చేస్తుండగా గతంలో గణపతిదేవుడు అన్నమాట జ్ఞప్తికొచ్చింది.

ప్రేరణ నృత్త రూపకల్పన చేస్తూ గణపతిదేవునికి చూపిన సమయంలో.. ఆయన ప్రదర్శన చూస్తూ పక్కనున్న జాయపుని వైపు వంగి..

''ఇక్కడ మృదంగ ధ్వని కన్నా డప్పుహోరు ఉంటే.. శివశివా! అదిరిపోయేది జాయా..'' అన్నాడు ఊగిపోతూ.

అప్పటివరకూ డప్పు శాస్త్రీయ సంగీత కచేరీలలోనూ, మార్గి నాట్యకార్యకలాపాల్లోనూ ఎందుకు ఉపయోగిం